# గోతులలో రాళ్లు పోశారు తారు మరిచారు



**చాట్రాయి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** చాట్రాయి నర్సాపురం మధ్య ఆర్ అండ్ బి రోడ్ లో దారుణమైన గోతులు ఉండగా దీనిపై ప్రభాతవార్త అనేకమార్లు ప్రజల ఇబ్బందులను వెలుగులోకి తీసుకురాగా ఎట్టకేలకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు. అయితే గోతులలో కేవలం చిప్స్ మాత్రం పోసి తారు పోయటం మరిచిపోయారు. దీంతో గోతులు పూడ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. గోతులలో పూసిన రాళ్ల వల్ల ద్విచక్ర వాహనాలకే కాకుండా కార్లు ఆటోలకు కూడా ఇబ్బందికరంగా మారింది. వర్షం పడితే గోతులు లో ఉన్న రాళ్లు మొత్తం కొట్టుకుపోయి మరింత ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికి మరమ్మతులు చేయించినట్లు రికార్డులలో నమోదు చేసి ఆమ్యామ్యాలకు అలవాటు పడటం వల్లే ఇటువంటి కార్యక్రమాలకు అధికారులు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలికి మరమ్మతులు సక్రమంగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వరల్డ్ ఛాంపియన్ సుదర్శనం మరణం క్రీడాకారులకు తీరని లోటు



**భీమవరం ఏప్రిల్ 29 ప్రభాతవార్త** అంతర్జాతీయ స్థాయిలో 115 మెడల్స్ సాధించిన గొప్ప అథ్లెటిక్స్ మాస్టర్ పాకెర్ల సుదర్శనం అని, అయన మరణం క్రీడాకారులెందరికో తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. భీమవరం బేతనిపేట చర్చ్ లో బుధవారం అథ్లెటిక్స్ మాస్టర్ పాకెర్ల సుదర్శనం జ్ఞాపకార్థక కూడిక నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. డా పట్టా దేవరాజ్, ఎస్ దానియేలు పుష్పరాజ్ మాట్లాడుతూ కఠోరమైన శ్రామికులు సుదర్శనం అని, ప్రతి క్రీడల్లోనూ రాణించగల సత్తాకలిగిన వ్యక్తి అని, 90ం వయసులో షాట్ పుట్, జావెలిన్ లో వరల్డ్ ఛాంపియన్ సాధించారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో 115 మెడల్స్ సాధించిన గొప్ప మాస్టర్ సుదర్శనం అని, మొదటి నుంచి 100 ఛాంపియన్ మెడల్స్ సాధించాలనే తపనతో ఉండేవారన్నారు. వెటరన్ లో కూడా వరల్డ్ ఛాంపియన్ గా నిలవడం అయన పట్టుదలకు నిదర్శమని, అయన బౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో ఎప్పటికి చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఏఎస్ మార్టిన్స్, వి కరుణాకరన్, గంటా సుందర్ కుమార్, పాకర్ల జీవరత్నం, దాసరి జానీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన కల్వర్టు

## పట్టించుకోని అధికారులు



**కొయ్యలగూడెం రూరల్ ప్రభాతవార్త ఏప్రిల్ 29** కొయ్యలగూడెం మండల కేంద్రంలోని తిరుమల కళ్యాణ మండపం సమీపంలో ఉన్న కల్వర్టు ప్రస్తుతం మృత్యుపాశంలా మారింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఈ కల్వర్టు ధ్వంసమై పెద్ద గొయ్యి ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఈ గోతిని గమనించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ?పెద్ద గొయ్యి పడి ఇనుప కడ్డీలు బయటకు వచ్చినప్పటికీ, అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మట్టి మాఫియాతో రహదారి ఛిద్రం

## ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి



**మొగల్తూరు ఏప్రిల్ 29(ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా** మొగల్తూరు మండలం కొత్తట, జిల్లేడు తిప్ప, ముత్యాలపల్లి జాతీయ రహదారి 216 పై మట్టి మాఫియా అక్రమ రవాణా కారణంగా తీవ్రంగా దెబ్బతింటోంది. తాజాగా తీసిన దృశ్యాల్లో రహదారి మధ్యలోనే అధికారులు కళ్లుగప్పీ అక్రమంగా తరలిస్తున్న పెద్ద మట్టి గెడ్డలు పడి 216 జాతీయ రహదారిపై ప్రయాణికులకు వాహనదారులకు ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రమాదకరంగా మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతిరోజూ ఇసుక, మట్టి తరలించే ట్రాక్టర్లు, లారీల అధిక బరువు కారణంగా రహదారి బలహీనమై ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం ద్వారా గ్రామాల మధ్య రాకపోకలు ఎక్కువగా జరుగుతుండగా, పాఠశాల పిల్లలు, రైతులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగినట్టు సమాచారం. స్థానిక ప్రజలు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని మొన్న నాలుగు రోజుల క్రితం మైనింగ్ అధికారులు కొందరు మట్టి మాఫియా యజమానులపై దాడులు నిర్వహించిన ముత్యాలపల్లి కొత్తట లో దాడులు నిర్వహించకపోవడంపై మినహాయింపు నివ్వడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మట్టి మాఫియా కు కొమ్ము కాయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి, రహదారి సమస్యను త్వరగా పరిష్కరించాలి అని స్థానికులు కోరుతున్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి-కారం దారయ్య




**వేలేరుపాడు,ఏప్రిల్ 29(ప్రభాత వార్త):** స్థానిక సిపిఐ కార్యాలయంలో కరటం సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఏఐటీయూసీ ఆశ వర్కర్ల సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కారం దారయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలో గత రెండు నెలల నుండి ఆశా వర్కర్లకు వేతనాలు విడుదల చేయలేదన్నారు.వేతనాలు విడుదల చేయకపోవడం వలన కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందని ప్రభుత్వం వెంటనే రెండు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని లేని పక్షంలో ఏఐటీయూసీ తరఫున పోరాటం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కారం కుమారి టి రాజేశ్వరి టీ ముక్కమ్మ టి రాములమ్మ లావణ్య వేణు పిట్టా సీత వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు

# పేహల్గామ్ అమరవీరుల త్యాగం భారత్ కే స్ఫూర్తి

## నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా



**నూజివీడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పేహల్గామ్ అమరవీరుల త్యాగఫలం యావత్ భారతదేశానికి స్ఫూర్తిదాయకమని, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కాశ్మీర్ పర్యటనలో ఉన్న నూజివీడు టిడిపి నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు కొనియాడారు. ఇటీవల మంగళవారం పెహల్గాం లోని బైసరణ్ అమరవీరుల స్మారక చిహ్నాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి వారికి వినమ్రపూర్వక నివాళులు అర్పించారు. గత ఏడాది (22 ఏప్రిల్ 2025) జరిగిన దురదృష్టకర దాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది అమాయక వీరుల జ్ఞాపకార్థం ఈ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి ఘటనలో అశువులు బాసిన వీరుల త్యాగాలను శ్రీనివాసరావు స్మరించుకున్నారు. "దేశం కోసం, శాంతి కోసం ప్రాణాలర్పించిన ఆ 26 మంది వీరుల త్యాగం ఎప్పటికీ వెలకట్టలేనిదన్నారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి ధైర్యసాహసాలు రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కాపా శ్రీనివాసరావు అన్నారు. ప్రధానంగా నేటి యువత భారత సైనికులు చూపుతున్న ధైర్య , సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు. దేశం కోసం వారు చేస్తున్న త్యాగం మరువలేనిదని అన్నారు. కన్నవారికి, జన్మించిన గ్రామానికి సుదూర ప్రాంతంలో ఉంటూ దేశ ప్రజల కోసం, వారి భద్రత కొరకు కొన్ని సందర్భాలలో ప్రాణాలను సైతం కూడా లెక్కచేయకుండా ఫణంగా పెట్టి శత్రు దేశాలతో విరోచిత పోరాటం చేస్తున్న భారత జవానుల కృషి సాటిలేనిది అన్నారు.

# నర్సరీలో ఘర్షణ: తండ్రీకొడుకులపై 324 సెక్షన్ కింద కేసు నమోదు



**జంగారెడ్డిగూడెం రూరల్ ప్రభాతవార్త ఏప్రిల్ 29** ?జంగారెడ్డిగూడెం మండలంలోని వేగవరం దగ్గర జామా నర్సరీ వద్ద సాగునీటి వివాదంలో కౌలు రైతుపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నర్సరీ సాగు చేస్తున్న పసుపులేటి సత్యనారాయణ, ఆయన కుమారుడు దినేష్ కలిసి సాగునీటి విషయమై వచ్చిన గొడవలో చేబోయిన రమేష్ బాబు (44)పై రాయితో దాడికి దిగారు. ఈ దాడిలో రమేష్ బాబు తలకు తీవ్ర గాయం కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై ఐపీసీ సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపారు. ఎస్సై వీరప్రసాద్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు



**తాడేపల్లిగూడెం,ఏప్రిల్ 29 (ప్రభాకర్ వార్త)** రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు ఆదేశించారు. పట్టణంలోని 32వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. వార్డులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, డ్రైనేజీలో మురుగు నిల్వ లేకుండా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. వర్షాకాలంలోపు డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం వార్డులో నిర్మాణంలో ఉన్న నూతన స్విమ్మింగ్ పూల్ పనులను కమిషనర్ పరిశీలించారు. "శ్రీ బోలిశెట్టి శ్రీనివాస్" పేరుతో నిర్మిస్తున్న ఈ స్విమ్మింగ్ పూల్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని గుత్తేదారులకు, సిబ్బందికి స్పష్టం చేశారు. వార్డు అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని కమిషనర్ ఏసుబాబు వివరించారు.

## పారిశుద్ధ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రతి పని ప్రజలకు చేరువ కావాలి

### జెడ్పి సీఈవో జగదాంబ



**తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 29 (ప్రభాత వార్త)** గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ప్రతి పనీ ప్రజలకు చేరువకావాలని జెడ్పి సీఈవో జగదాంబ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో జగదాంబ మాట్లాడుతూ ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం చేయాలని చెప్పడం మాత్రమే కాదని పంచాయతీ స్థాయి నుంచి ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. స్వచ్ఛత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, స్వచ్ఛ రథం ద్వారా చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ఇంటింటికి చేరువు కావాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి అక్కడ కూరగాయ మొక్కలు, ఆకుకూరలు వేయాలని సూచించారు. సంపద తయారీ కేంద్రం నుంచి వచ్చిన వర్మీతో మొక్కలు పెంచడం ద్వారా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించే విధానం ప్రజలకు అలవాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై ఉన్న దుమ్ము ధూళి చెత్తను శుభ్రం చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎం ప్రభాకరరావు, ఎంపీడీవో వి.చంద్రశేఖరం, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేషు కార్యదర్శులు టి.రవిచంద్ర, రఘునాథ రాజు, ఎం ఆర్ సి ఎం రవి కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# లింగపాలెం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



**లింగపాలెం ప్రభాత వార్త ఏప్రిల్ 29** లింగపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులతో బాల సాహిత్య పుస్తకాలను చదివించి, వాటిలోని నీతి కథలను చెప్పించారు. రిసోర్స్ పర్సన్స్ ఎం తరుణ్, జె నరేష్ విద్యార్థులకు గణితంలో మెళకువలు నేర్పించి, పలు సమస్యలను సులభంగా సాధించేలా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి 15 మంది విద్యార్థులు హాజరుకాగా, అనంతరం వారికి అల్పాహారం పంపిణీ చేశారు. సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నిర్వాహకులు కోరారు.

# డీజిల్ కొరత లేదు



**ఏలూరు, ఏప్రిల్, 29: ప్రభాతవార్త** ఏలూరు జిల్లాలో మంగళవారం రాత్రి 7 గంటల వరకు 288 కిలోలీటర్లు పెట్రోల్, మరియు 453 కిలోలీటర్లు డీజిల్ అమ్మకం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక గౌడ చెప్పారు. అలాగే, కూపన్ విధానం ద్వారా అగ్రికల్చర్, ఫిషరీస్ మరియు ఎమర్జెన్సీ సర్వీసులకు సుమారు 796 కూపన్ల ద్వారా 32,704 లీటర్ల డీజిల్ సరఫరా చేయబడిందన్నారు. ఇంధన సరఫరాలో ఏవైనా అంతరాయాలు కలిగితే లేదా పెట్రోల్ బంకుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, కృత్రిమ కొరత సృష్టించినా, వినియోగదారులు వెంటనే కంట్రోల్ రూమ్ 7569296272 నంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని, వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటారని జేసి చెప్పారు. జిల్లాలో ఇంధన సరఫరాను క్రమబద్ధీకరించి నిరంతర సరఫరాను నిర్ధారించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని అన్ని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతినిధులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, స్టాక్ తక్కువగా ఉన్న బంకులకు తక్షణమే రీఫిల్ ట్యాంకర్లను పంపించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుత ఏప్రిల్ నెలలో వ్యవసాయ అవసరాలు (కోత కాలం), అత్యవసర సేవలు మరియు ప్రజా రవాణాకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా డీజిల్ మరియు పెట్రోల్ సరఫరా జరుగుతున్నదన్నారు. ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసర నిల్వలు పెంచుకునే ప్రయత్నాలు చేయవద్దన్నారు. పెట్రోల్ బంకుల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు చేసిందన్నారు..

# గ్రంథాలయంలో పుస్తక పఠనం



**పెనుమంట్ర, ఏప్రిల్ 29, (ప్రభాతవార్త)** మండల కేంద్రం పెనుమంట్ర శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రిసోర్స్ పర్సన్ సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలు బోధించడం జరిగిందని గ్రంథ పాలకుడు కృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఆంగ్లంలో మాట్లాడించడం జరిగిందని తెలిపారు. వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చదువరులు పాల్గొన్నారు.

# అకౌంటెంట్ నండూరి శేషావతారం కన్నుమూత



**కామవరపుకోట,ఏప్రిల్ 29(ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన ప్రముఖ అకౌంటెంట్ నండూరి శేషావతారం(66) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. కామవరపుకోట పరిసర ప్రాంతాల్లోని పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలకు అకౌంటెంట్‌గా దశాబ్దాల కాలం పాటు ఆయన సేవలు అందించారు. నిబద్ధత గల వ్యక్తిగా, ఆధ్యాత్మిక వేత్తగా ఆయనకు మంచి పేరుంది. శేషావతారం ఇద్దరు కుమారులు కూడా ప్రస్తుతం కామవరపుకోటలో అకౌంటెంట్‌లుగా రాణిస్తున్నారు. ఆయన మృతి పట్ల స్థానిక వ్యాపారులు, ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రతి మహిళ శక్తి యాప్‌ను ఆయుధంగా మలచుకోండి

### అవగాహనా సదస్సులో రూరల్ సీఐ రవికుమార్



**కైకలూరు ఏప్రిల్ 29 (ప్రభాతవార్త)** ప్రతి మహిళా తమ స్మార్ట్ ఫోన్ లో శక్తి యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలి అని,అత్యవసర సమయాల్లో 112 నెంబర్ కు కూడా కాల్ చేయవచ్చునని,శక్తి యాప్ ను ఆయుధంగా మలచుకుని భయం లేని సమాజాన్ని నిర్మించాలని మీ రక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత అని కైకలూరు రూరల్ సీఐ వి రవి కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చటాకాయ గ్రామంలో శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత గురించి కైకలూరు రూరల్ ఎస్సై వి రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ శక్తి యాప్ వలన కలిగే ప్రధాన ప్రయో జనాలు తక్షణ సహాయం గురించి, ఎవరైనా ఏదైనా ఆపద లో ఉన్నప్పుడు లేదా ఎవరైనా వేధిస్తున్నప్పుడు యాప్ లోని రాఉా బటన్ ను నొక్కితే చాలు అన్నారు. ఫోన్ కాల్ చేయాల్సిన అవసరం లేకుండానే మీ లొకేషన్ వివరాలు వెంటనే సమీపం లోని పోలీస్ కంట్రోల్ రూమ్ కు మరియు మీరు సేవ్ చేసుకున్న ఐదుగురు కుటుంబ సభ్యుల ఫోన్లకు చేరుకుంటాయన్నారు. మీరు ప్రయాణిస్తు న్నప్పుడు ఈ యాప్ ద్వారా మీ కదలికలను పోలీసులు మరియు మీ కుటుంబ సభ్యులు గమనించవచ్చు. దీని వల్ల తెలియని ప్రాంతాలకు వెళ్లేటప్పుడు భద్రత పెరుగుతుందన్నారు.త్యవసర సమయంలో SOS బటన్ నొక్కిన వెంటనే, ఆ పరిసరాల్లో జరిగే మాటలు లేదా దృశ్యాలు ఆటోమేటిక్ గా రికార్డ్ అయ్యి పోలీసులకు అందుతాయని వివరించారు.ఇది నేరస్తు లను పట్టు కోవడానికి బలమైన సాక్ష్యంగా మారుతుందన్నారు. మీ సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ చిరునామా మరియు ఫోన్ నెంబర్ లను ఈ యాప్ ద్వారా సులభం గా తెలుసుకోవచ్చు అన్నారు.బాలికలపై జరిగే వేధింపులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మరియు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.మహిళలు తమ హక్కులను తెలుసు కున్నప్పుడే నిజమైన సాధికారత లభిస్తుంది. పోలీసు యంత్రాంగం మీకు అండగా ఉంటుందని, భయం వీడి ఏ సమస్య ఎదురైనా ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు.

# పులపర్రు గ్రామ విఆర్ఓపై దాడి



**మండవల్లి ఏప్రిల్ 29(ప్రభాతవార్త)** మండలంలోని పులపర్రు గ్రామ రెవిన్యూ అధికారి ముద్రబోయిన వెంకటేష్ పై బుధవారం సాయంత్రం కొంతమంది గ్రామస్తులు దాడి చేశారు.పత్రికలలో వచ్చిన కథనాల ప్రకారం తాసిల్దార్ గోపాల్ ఆదేశాల మేరకు పులపర్రు గ్రామ విఆర్ఓ వెంకటేష్ ప్రభుత్వ భూమి పూడ్చివేతపై పరిశీలనకు వెళ్లిన సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.ప్రభుత్వ భూమిని పూడ్చవద్దని ఎమ్మార్వో ఆదేశాలను తెలియజేయడానికి వెళ్లిన విఆర్ఓను, ప్రభుత్వ ఉద్యోగి అని కూడా లెక్కచేయకుండా ముంగర రాజు, ముంగర సావిత్రి, ముంగర శ్రీనివాసరావు అనేవారు దురుసుగా ప్రవర్తించి దాడి చేసినట్లు సమాచారం.ఈ ఘటనలో విఆర్ఓకు గాయాలు కావడంతో కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగికే భద్రత లేకపోతే, సామాన్య ప్రజలకు ఎలా భద్రత కల్పిస్తారు?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# చదవడం మాకు ఇష్టం

## శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు



**నరసాపురం ఏప్రిల్ 29 ప్రభాతవార్త** నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం నందు వేసవి జ్ఞాన తరగతులు సందర్భంగా హాజరైన విద్యార్థిని విద్యార్థులు చేత చదవడం మాకిష్టం కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. పిల్లల చేత పుస్తక పఠనం చేయించడం వారికి వివరించడం జరిగింది.. పిల్లలు ఎంతోఉత్సాహంగా కథలు చెప్పినారు "తాబేలు కుందేలు" కథను మోక్షశ్రీ అనే విద్యార్థిచక్కగా వివరించాడు..పరోపకారం,అన్నదమ్ములు కథలు మరియు నాడీ మండల వ్యవస్థ గురించి రిసోర్స్ పర్సన్ సుబ్బారావు శాస్త్రవేత్త వివరించారు, డ్రాయింగ్ క్లాస్ స్పోకెన్ ఇంగ్లీష్ పై స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాస్ .. పిల్లలకు శిక్షణ ఇచ్చినారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోష్యుల కుమార్, భట్టిప్రోలు సత్యనారాయణ, సుధీర్ మోహన్ సూర్యం బాబు.. విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులుపాల్గొన్నారు...జూన్ 6వ తేదీ వరకు జరిగే ఈ సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం లో అందరు పాల్గొనవలసిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కె జే ఎస్ ఎల్ కుమారి కోరారు..

# స్వచ్ఛ పదం కార్యక్రమం



**ఇరగవరం ఏప్రిల్ 29 (ప్ర భాత వార్త** )"స్వచ్ఛపధము " కార్యక్రమం లో భాగంగా ఇరగవరం మండలంలోని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ పధం" కార్యక్రమము ద్వారా ప్రధాన రహదారులను శుభ్రం చేసారు. పారిశుద్ధ్య కార్మికులు రహదారుల ప్రక్కన చెత్త, వ్యర్థాలను తొలగించడం, పొదలను తొలగించడం, రోడ్లను శుభ్రంగా ఆకర్షణంగా ఉంచారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు పి ఆర్ ఒన్ అప్ లో కార్యక్రమం వివరాలను నమోదు చేసారు. కూటమి నాయకులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసు , మండల స్ధాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది, ఎన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బంది పాల్గొన్నారు..

# డీజిల్ పై కృత్రిమ కొరతకు పాల్పడితే చర్యలు

## జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా



**చాట్రాయి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** పెట్రోల్ డీజిల్ పై కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా అన్నారు. బుధవారం మండలంలోని పలు పెట్రోల్ బంకులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ కొరత లేదని కావాలనే కొన్ని పెట్రోల్ బంకులు ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్నాయని అన్నారు. అటువంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. పెట్రోల్, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం టీంలను ఏర్పాటు చేసిందని ఆయన చేశారు. ప్రజలు కూడా పెట్రోల్ డీజిల్ గురించి అపోహలు నమ్మవద్దని రేటు పెరుగుతుందనే ఉద్దేశంతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారిపై కూడా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సరిపడా పెట్రోల్ డీజిల్ తీసుకోవాలని అక్రమంగా నిల్వ ఉంచితే కూడా చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు వరి మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నందున డీజిల్ అవసరం ఉన్నందున రైతులు తమకు సరిపడా డీజీలు తీసుకొని పనులు చేసుకోవాలని ఆయన సూచించారు. బంకులలో కృత్రిమ కొడతా ఏర్పాటు చేసి రైతులను ఇబ్బంది పెడితే స్థానికంగా ఉన్న వ్యవసాయ అధికారికి, మండల స్థాయి అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి




**భీమవరం ఏప్రిల్ 29 ప్రభాతవార్త** క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేయడం ద్వారా మే నెల 9వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని" 3వ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డా.బి.లక్ష్మీనారాయణ కోరారు. కక్షిదారుల్లో లోక్ అదాలత్ రాజీల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా న్యాయమూర్తుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. ఎక్సైజు కేసుల్లో కాంపౌండ్ ఫీజు కట్టించి అవార్డు కాపీలను దాఖలు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో భీమవరం 1వ పట్టణ, 2వ పట్టణ, రూరల్, ఆకివీడు, ఉండి, కాళ్ళ, పాలకోడేరు, వీరవాసరం, భీమవరం ఎక్సైజు, ఆకివీడు ఎక్సైజు పోలీసు స్టేషన్ల సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి



**అత్తిలి, ఏప్రిల్ 28( ప్రభాత వార్త)** దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించాలని కోరుతూ ఈ నెల రెండవ తేదీన భీమవరం రానున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మందకృష్ణ మాదిగ కార్యక్రమాన్ని విజయం విజయవంతం చేయాలని మండల ఎంఆర్పిఎస్ నాయకులు కోరారు. అత్తిలిలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గెద్దం కిరణ్ కుమార్, అత్తిలి, ఇరగవరం మండలాలు ఇన్చార్జి సనమండ్ర సునీత ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం దళిత క్రైస్తవులను ఎస్ సి లు పరిగణించరాదంటూ ఇచ్చిన తీర్పును పై మంద కృష్ణ మాదిగ భీమవరం రానున్నట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులను సవరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి గొల్లపల్లి శ్రీను, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చిన్నా, నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బ దాసరి కళ్యాణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసన

## జర్నలిస్టుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్



**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 29** విలేకరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ బుధవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జర్నలిస్టులు భారీ ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (.ఏపీయూడబ్ల్యూజే ) ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ఈ నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం ఆర్డీఓ ఎం.వి. రమణకు వినతిపత్రం సమర్పించారు. ?ఈ సందర్భంగా ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, జగన్మోహన్ రెడ్డిని అతి కిరాతకంగా హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రజ్యోతి యాజమాన్యం కూడా మానవత్వంతో స్పందించి 50 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ?ఎలక్ట్రానిక్ మీడియా పట్టణ అధ్యక్షుడు మొడియం ప్రసాద్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు చేయాలంటే భయపడే విధంగా చట్టపరమైన చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కే.వీ రమణరావు, డి.వి భాస్కరరావు, పాలడుగుల రామకృష్ణ, కె.వెంకట్, మనెల్లి గంగరాజు, వందవాసు శ్రీనివాస్, నండూరి కిషోర్ బాబు, నాగసూరి బాలసుబ్రమణ్యం, ఎం.చందు వెంకట్, జె.నరేష్, కంచర్ల శ్రీనివాస్, ఎస్.నాగరాజు, నేట్రూ గణేష్, అందుగుల నానాజీ, తోట నాగబాబు, బడిగంటి మోహన్, కె.సురేష్, తెల్లం హేమంత్, ఫణి, రాఘువ తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారాయి స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడి



**చింతలపూడి.. ప్రభాత వార్త** చింతలపూడి స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది కలిసి ఎక్సైజ్ నేరముల కొరకు దాడులు నిర్వహించగా చింతలపూడి మండలం నామవారం గ్రామానికి చెందిన హలవత్తు పద్మ అను మహిళ వద్ద నుండి (03) లీటర్ల సారాయిని స్వాధీన పరుచుకుని ఆ మహిళపై కేసు నమోదు చేయడమైనది అలాగే ఈరోజు చింతలపూడి మండలం నామవారం గ్రామానికి చెందిన హలవత్తు పద్మ మరియు కామవరపుకోట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వీరవల్లి కోటేశ్వరరావు మరియు వీరవల్లి సుబ్బలక్ష్మి మరియు కల్లచెరువు గ్రామానికి చెందిన పల్లి సుమంత్ అను నలుగురిని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపరచగా 129 బి ఎన్ ఎస్ ఎస్ చట్టం ప్రకారం బైండోవర్ బాండ్ విధించారు. ఈ దాడుల లో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్.ఐ లు అబ్దుల్ ఖలీల్ , మరియు సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి. ఐ.పి.అశోక్ తెలిపినారు.

# పెట్రోల్ బంకులను ఆకస్మిత తనిఖీ చేసిన తాసిల్దార్ కే రాజ్ కిషోర్



**మొగల్తూరు ఏప్రిల్ 29(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం లోని పెట్రోల్ బంకులలో బుధవారం మండల తాసిల్దార్ ఆకస్మిత తనిఖీ నిర్వహించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, మానస ఫిల్లింగ్ స్టేషన్ స్టేషన్ లో డీజిల్, 3000 లీటర్లు, పెట్రోలు 4000 లీటర్లు, ముత్యాలమ్మ పిల్లింగ్ స్టేషన్ లో, డీజిల్ 15000 లీటర్లు, పెట్రోలు, 5000 లీటర్లు, శ్రీరామ పెట్రోల్ బంకులో డీజిల్ 12000 లీటర్లు, పెట్రోలు 2500 లీటర్లు, అందుబాటులో ఉన్నాయని, వాహనదారులు వరి పంటలు పండించే రైతులు, ఆక్వా రైతులు ఆందోళన చందవలసిన అవసరం లేదని పెట్రోల్ మరియు డీజిల్ ఎప్పుడు అందుబాటులో ఉంటాయని తాసిల్దార్ కే రాజ్ కిషోర్ తెలియజేశారు, వారితో పాటుగా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్ర అభివృద్ధిలో నారా లోకేష్ కీలక పాత్ర

- ఎన్నో సంస్కరణలకు నాంది పలికిన లోకేష్
- పెట్టుబడులు తీసుకురావడంలో విశేష కృషి
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



**తణుకు, ఏప్రిల్ 29 ( ప్రభాత వార్త)** రాష్ట్ర అభివృద్ధిలో మంత్రి నారా లోకేష్ కీలకపాత్ర పోషిస్తున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో ఆయన చేస్తున్న కృషి కారణంగా ఎన్నో లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు తీసుకుంటున్న యువ నేత జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విజయవాడలో ప్రమాణం స్వీకారం చేయనున్న నేపథ్యంలో బుధవారం తణుకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు బయలుదేరి వెళ్లారు సుమారు 20 వాహనాల్లో బయలుదేరిన ర్యాలీ ఎమ్మెల్యే రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జోనల్ కోఆర్డినేటర్ గా నియమితులైన ఆరిమిల్లి రాధాకృష్ణ సైతం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రాష్ట్రంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా నారా లోకేష్ తీసుకొచ్చిన సంస్కరణలు ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పనకు అవకాశం ఏర్పడిందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం నారా లోకేష్ ను ఎన్నో ఇబ్బందులకు వైసిపి నేతలు ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. అవమానాలు, అవహేళనకు గురి చేసి లోకేష్ ను లక్ష్యంగా చేసుకుని జగన్మోహన్ రెడ్డి ఆడిన కపట రాజకీయాల్లో తట్టుకున్నారని చెప్పారు. దురదృష్టవశాత్తు 2019 సంవత్సరంలో ఆనాడు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు పట్ల అవినీతి, అరాచకాలు పట్ల లోకేష్ ఎలుగెత్తిన యువగళం పాదయాత్ర దాదాపు 3212 కిలోమీటర్ల మేర చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక వర్గాలను కలిసి ఆనాడు ప్రభుత్వం చేసిన దుర్మార్గ చర్యలను ఎలుగెత్తి చాటారని చెప్పారు. ఎంతోమంది యువతకు భరోసా కల్పించిన లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే హామీ నెరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా పార్టీ పటిష్టం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు తణుకు నియోజవర్గంలో కృషి చేస్తున్నారని చెప్పారు. పార్టీ బలోపేతానికి జోనల్ కోఆర్డినేటర్ గా తనను అధిష్టానం నియమించిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి రావడం పట్ల తణుకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## శ్రీదేవి భూదేవి సమేతంగా చిన్న వెంకన్న

# దివ్య కళ్యాణం చూసొద్దాం రారండి

## భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు



**ద్వారకాతిరుమల, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ద్వారకాతిరుమలలో చిన్న వెంకన్న తిరు కళ్యాణ మహోత్సవాలు అనేవి కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు... అది భక్తి, భవ్యం, భగవద్భావం కలిసిన ఒక దైవానుభూతి. శేషాచల పర్వతంపై వెలసిన ద్వారకా తిరుమల క్షేత్రంలో జరిగే ఈ తిరు కళ్యాణ మహోత్సవం, భూలోకంలో స్వయంగా శ్రీమహావిష్ణువు తన భక్తులకు అనుగ్రహం చేకూర్చే పవిత్ర క్షణంగా భావిస్తారు. "చిన్న వెంకన్న"గా ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి, ఈ సందర్భంగా పెండ్లికొడుకుగా అలంకరించబడి, ఆభరణాలతో, పుష్పాలతో శోభాయమానంగా దర్శనమిస్తాడు. ఈ దివ్య కళ్యాణ వేడుకలో, స్వామివారు తన భాగస్వాములు అయిన శ్రీదేవి మరియు భూదేవి సమేతంగా కళ్యాణమాడటం, భక్తులకు ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తుంది --- ధర్మం, ప్రేమ, శాంతి ఈ మూడు కలిసి జీవితం పూర్ణమవుతుందని. శ్రీమన్నారాయణుడి కృపాకటాక్షం పొందిన పవిత్ర క్షేత్రం ద్వారకా తిరుమల లో, చిన్న వెంకన్నగా ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి స్వయంగా భక్తుల మధ్యలో పెండ్లికొడుకుగా దర్శనమిస్తాడు. ఆ అలంకారం... ఆ తేజస్సు... ఆ దివ్య సౌందర్యం చూసిన ప్రతి భక్తుడి మనసు భక్తి సముద్రంలో మునిగిపోతుంది. ఈ తిరు కళ్యాణం వెనుక ఒక లోతైన ఆధ్యాత్మిక తత్త్వం దాగి ఉంది. స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా కళ్యాణం జరుపుకోవడం అనేది జగత్తులో సమతుల్యతకు సంకేతం. శ్రీదేవి ఐశ్వర్యానికి ప్రతీక, భూదేవి సహనానికి ప్రతీక. ఈ రెండింటిని కలుపుకొని జీవితం సాగితేనే సంపూర్ణత వస్తుందని ఈ మహోత్సవం తెలియజేస్తుంది. వేద మంత్రాల,అర్చకుల పూజలతో, మంగళవాయిద్యాల నినాదంతో జరిగే ఈ కళ్యాణం, భక్తుల హృదయాలను పరవశింపజేస్తుంది. ప్రతి క్షణం ఒక యజ్ఞంలా, ప్రతి మంత్రం ఒక ఆశీర్వాదంలా అనిపిస్తుంది. స్వామివారి తాళి కట్టే ఆ పవిత్ర క్షణంలో,అక్కడ ఉన్న ప్రతి భక్తుడు తన జీవితంలోని అన్ని కష్టాలు తొలగిపోతాయని విశ్వసిస్తాడు. ఈ మహోత్సవం కేవలం దేవాలయ పరిమితిలోనే కాదు, గ్రామమంతా, పరిసర ప్రాంతమంతా భక్తి పరవశంలో మునిగిపోతుంది. దీపాలతో వెలిగిన వీధులు, గోపురాలపై అలంకరణలు, అన్నదాన సేవలు -- అన్నీ కలిపి ఒక దైవిక వాతావరణాన్ని సృష్టిస్తాయి. చిన్న వెంకన్న తిరు కళ్యాణం అనేది భక్తుడి హృదయంలో భగవంతునితో కలిసే ఒక పవిత్ర బంధం. ఈ దివ్య క్షణాలను దర్శించేవారికి ఆత్మశాంతి, ఆనందం, ఆశీర్వాదం కలుగుతాయని విశ్వాసం. ఈ పవిత్ర క్షేత్రంలో కళ్యాణ ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వంశపారపర్యం చైర్మన్ ఎస్ పి ఎస్ సుధాకర్ రావు, ఆలయ ఈవో వి త్రినాధరావు ఆలయ సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.



# జెఇఇ మెయిన్స్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం ఏప్రిల్ 29 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన జెఇఇ మెయిన్స్ -26 పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుముల విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించడం అద్వితీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఆలిండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అంజిబాబు సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూఆలిండియా 3వ ర్యాంకుతో బి కౌషల్ ప్రథమ స్థానం, 17వ ర్యాంకు కె జాస్మిత, 18వ ర్యాంకు బి వెంకట రమణ, 112వ ర్యాంకు జి మోనిషా, 174వ ర్యాంకు సిహెచ్ ధనుంజయ బాలాజి, 222వ ర్యాంకు పి మోహిత్ కృష్ణసాయి, 252వ ర్యాంకు ఐ రోహిత్ కుమార్, 327వ ర్యాంకు జి రోషిత్, 474వ ర్యాంకు పి వర్షిత్, 638వ ర్యాంకు జెహెచ్ లక్ష్మణ్ కుమార్, 674వ ర్యాంకు ఎన్ కరుణ సాహితి, 744వ ర్యాంకు పి నరసింహ వర్మ 844వ ర్యాంకు సిహెచ్ భాస్కర శ్రీశేష సాత్విక్, 894వ ర్యాంకు ఆర్ జాహ్నవి లు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. జెఇఇ మెయిన్స్ ఆలిండియా 3వ ర్యాంకు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ పి శ్రీనివాస్ వర్మ, జి సతీష్ బాబు, ఎస్ సాయిరాజు మాట్లాడుతూ 9 మంది ఆలిండియా 500 ర్యాంకు లోపు, 1000 లోపు 14 గురు సాధించారన్నారు. సుమారు 125 మందిపైగా విద్యార్థులు కేవలం భీమవరం బ్రాంచ్ నుండీ ఎన్ఐటి, ఐఐఐటి కళాశాలలో అడ్మిషన్లు సాధించగలరన్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్ అందించి సత్కరించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఏవో శ్రీనివాస్, సురేష్ రెడ్డి, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

# వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 29** జంగారెడ్డిగూడెం ఇందిరానగర్ అభయ ఆంజనేయస్వామి ఆలయ వద్ద వారధి ట్రస్ట్ 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు వలవల తాతాజీ తన తల్లిదండ్రులు వలవల నాగభూషణం, నాగమణి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ముఖ్య అతిథులు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జి మేకా ఈశ్వరయ్య, టీడీపీ నాయకుడు పెనుమర్తి రామకుమార్, ఆర్యవైశ్య నాయకుడు చిన్ని రామసత్యనారాయణ, బీజేపీ నాయకురాలు పీసుపాటి రామలక్ష్మి పాల్గొని మాట్లాడారు. 2016లో ప్రారంభమైన వారధి ట్రస్ట్ పదేళ్లుగా సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. తాతాజీ మాట్లాడుతూ.. వేసవి కాలం ముగిసే వరకు ప్రతిరోజూ మంచినీరు, ఆరు మంగళవారాల పాటు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షేక్ హసీనా, ఉండ్రాజవరపు శ్యామల, ఉదర బాబి, బసవరాజు వేణు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**అత్తిలి,ఏప్రిల్ 2 9, (ప్రభాతవార్త)** అత్తిలి మండలం కొ మ్మర గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈతకోటకు చెందిన బిక్కిన శ్రీనివాసరావు అనే వ్యక్తి గాయపడినట్లు అత్తిలి ఎస్సై కేఎన్ విశ్వనాథ్ తెలిపారు. ఈ నెల 27 న శ్రీనివాసరావు యండగండి గ్రామంలో పాత ఇండ్ల సామానులు కొనుగోలు చేసి మోటార్ సైకిల్ పై తీసుకొని వస్తుండగా కొమ్మర సమీపంలో నెంబర్ ప్లేట్ లేని మోటార్ సైకిల్ ఢీకొనడంతో కాలుకు బలమైన గాయం తగిలినట్లు తెలిపారు. బైకును ఢీకొన్న వ్యక్తి గుత్తి వీర్రాజుగా పేర్కొన్నారు. శ్రీనివాసరావు ను 108 అత్యవసర వాహనం లో తణుకు లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఒంటరి మహిళ కేసును 15 రోజుల్లోనే ఛేదించిన పట్టణ పోలీసులు

## వివరాలు వెల్లడించిన డీఎస్పీ విశ్వనాథ్



**తాడేపల్లిగూడెం,ఏప్రిల్ 29 (ప్రభాత వార్త)** తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లికి చెందిన ఒంటరి మహిళ పెరుమాళ్ళ నాగమణి (76) అనుమానస్పద కేసును 15 రోజుల్లో తాడేపల్లిగూడెం పోలీసులు ఛేదించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ విశ్వనాథ్ కేసు వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 14న బంగారం కోసం పెరుమాళ్ళ నాగమణిని నిందితుడు దగ్గుపల్లి ప్రసాద్ హత్య చేశాడని తెలిపారు. నిందితుడి దగ్గరి నుంచి రూ 3 లక్షల 45 వేలు విలువైన 36 గ్రాముల బంగారం, 3,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అప్పుల భారం ఉండడంతో ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారం దోచుకోవడానికి దగ్గుపల్లి ప్రసాద్ ప్రణాళిక రచించి హత్య చేశాడని తెలిపారు. ఈ కేసును సవాలుగా తీసుకుని 15 రోజుల్లోనే ఛేదించిన పోలీసులకు రివార్డ్ అందజేసారు. అనుమానస్పద వ్యక్తులను ఇంట్లోకి అనుమతించకుండా జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ విశ్వనాథ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ ఆది ప్రసాద్, ఎస్సైలు బాదం శ్రీనివాస్, పి.నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాత్రికేయుడు జగన్మోహన్ రెడ్డి హత్యను ప్రతి ఒక్కరూ ఖండించాలి



**జీలుగుమిల్లి, ఏప్రిల్ 29 (ప్రభాతవార్త)** చిత్తూరు జిల్లా వి.కోటకు చెందిన ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరుతూ జీలుగుమిల్లి మండల కేంద్రంలో బుధవారం వర్కింగ్ జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ బి. వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ, జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డిని క్రూరంగా హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.00 కోటి పరిహారం చెల్లించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆంధ్రజ్యోతి యాజమాన్యం కూడా రూ. 50.00 లక్షల పరిహారం చెల్లించి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొంతు రామకృష్ణ, జెట్టి రామకృష్ణ, క్రొవ్విడి నాగేంద్రప్రసాద్, చేపల లక్ష్మణ్, తలారి సతీష్, దారా మనోజ్, బొంతు రాంబాబు, కడిమి సాయి, ఒరిగేటి బెంజి, బట్టు సందీప్, గెడ్డం జనార్ధన్, కొప్పుల కృష్ణమోహన్, ఓబిలిశెట్టి రవితేజ, చిత్తపూడి పవన్ తదితరులు పాల్గొన్నారు.

